క్లుప్తంగా

కడపాయపల్లె చర్చిలో దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని కడపాయపల్లె గ్రామం బేతనియా చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్టు సంఘ కాపరి కోట పాటి ఫిలిప్ తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ మాట్లాడుతూ ఉపవాస ప్రార్థనలో భాగంగా ప్రతి ఒక్కరూ పాత జీవితాన్ని వదలిపెట్టి మారుమనస్సు పొంది క్రీస్తు మార్గంలో నడవాలని ఆయన హితువు పలికారు. అనంతరం ఆయన 50 మంది పురుషులకు, 50 మంది మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రేమ్‌కుమార్, క్రైస్తవులు పాలకొండయ్య, నాగూరు దానం, విజయ్, లలితమ్మ, రాజు, ఓబులేస్, బాబు, గంగాధర్, ప్రసాద్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాజంపేట : పట్టణంలోని మాజీ సర్పంచ్ డా.తోటరామయ్య స్వగృహంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ వైద్యనిపుణులు డా.రెడ్డి వరప్రసాద్ రోగులకు చికిత్స అందజేశారు. వైద్య నివారణకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ తనవంతుగా పేద రోగులకు ఏదో ఒక విధంగా వైద్య సేవలు అందించడం తనకు ఎంతో సంతోషం కలుగుతుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సిద్దవటం : సిద్దవటం- అట్లూరు మార్గ మధ్యలో ఉన్న కపర్దీశ్వర స్వామి కోన సమీపంలోని ఫారెస్టు చెక్ పోస్టు వద్ద ఆదివారం చలివేంద్రాన్ని సిద్దవటం రేంజర్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణీకులకు, పాదచారులకు దాహార్తిని తీర్చేందుకే అటవీశాఖ ఆధ్వర్యంలో ఇక్కడి చెక్ పోస్టు వద్ద చలివేంద్రను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఎఫ్‌బీఓ రాజశేఖర్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, అటవీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో పని చేయాలనడం సరికాదు

రాయచోటి టౌన్ : విద్యా కమిషన్ ఉత్తర్వుల మేరకు 10వ తరగతి పరీక్షలు జరిగే పాఠశాలలకు ఆరు రోజులు సెలవులు ప్రకటించి ఆ సెలవులకు పరిహారంగా జాతీయ పండుగలు, ఆదివారాలు, పండుగలలో పాఠశాలలు పని చేయాలని సూచించడం సరైనది కాదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆరోపించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుమతి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు, జిల్లా కోశాధికారి రామేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు గంగన్న, బాలరాజు, కృష్ణవేణి, రెడ్డి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు నరసింహులు, చెన్నకృష్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలోని పూజారి శివశర్మచే శంకర్ రెడ్డి, కవిత దంపతులు ఆదివారం రాములోరి పట్టాభిషేకంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పలువురు దాతలు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం డప్పు వాయిద్యాల మధ్య సీతారాముల మూలవిరాట్‌లను గ్రామ పురవీధులలో ఊరేగించారు.

బి.కొత్తకోటలో ఆర్‌ఎస్‌ఎస్ రూట్ మార్చ్

బి.కొత్తకోట: ఏటా నిర్వహించే ఆర్‌ఎస్‌ఎస్ సమ్మేళన కార్యక్రమం ఆదివారం బి.కొత్తకోటలో జరిగింది. బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాలకు చెందిన 110 మంది కార్యకర్తలు హజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ఘోష్ ప్రముఖ్ సత్యనారాయణ దేశభక్తి, ప్రజల్లో జాతి సమైక్యతను పెంపొందించడం అంశాలపై ప్రసంగించారు. అనంతరం కార్యకర్తలు పట్టణంలోని మెయిన్‌రోడ్డు, బైపాస్‌రోడ్డు, జ్యోతిచౌక్, దిగువబస్టాండ్, పీటీఎంరోడ్డు మీదుగా రూట్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఖండ సంఘచాలక్ సకలా ప్రభాకర్, విభాగ్‌సేవా ప్రముఖ్ కొండారెడ్డి, ఖండ కార్యవాహక్ రెడ్డెప్ప, జిల్లా సేవా ప్రముఖ్ సురేంద్ర, ఖండ శారీరక ప్రముఖ్ డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం

- అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి
- గుట్టపల్లెలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సంబేపల్లె: బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని అన్నమయ్య జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుట్టపల్లె గ్రామంలోని అంకిరెడ్డిగారిపల్లె, బోదానివడ్డిపల్లె, హరిజనవాడ, గుదియవాండ్లపల్లెలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా గుట్టపల్లె సమీపంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి సమస్యలపై ఆరా తీయడంతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన పాలన అందించేందుకు, ప్రజాసమస్యలు తెలుసుకుని వాటిని సత్వర పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్‌పాలన సాగుతోందన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమం అందుతుండటంతో మహిళలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి తమ సంతోషాన్ని వెల్లిబుచ్చారు. గుట్టపల్లె గ్రామంలో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత తదితర పథకాలు సుమారుగా అన్ని ఇళ్లకు అందాయి. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు లబ్ధి అందడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సూచించారు. బోదాని పడ్డెపల్లెలో డేరెంగుల మమత కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందటంతో వారు హర్షం వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన వినయతేజ రెండు కాళ్లు పని చేయకపోవడంతో పాఠశాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా ఉందని బాధితుడు శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన వెంటనే మూడు ఆ విద్యార్థికి పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడకుండా ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాలవెంకట్రమణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శంగా జగనన్న కాలనీ

మౌలిక వసతుల కల్పించి జగనన్న కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తీర్చిదిద్దుతామని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ ప్రజల కోసం కాలనీలో 33-11 కేవీ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణపు భూమిపూజలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి హాజరై, ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్‌చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, సర్పంచ్ అలివేలమ్మ, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, వసంతశ్రీనివాసులరెడ్డి, బేపారి మహమ్మద్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాగరాజు యాదవ్, రఘు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వైఎస్‌ఆర్ ఆసరా కార్యక్రమం

చిన్నమండెం : ఈ నెల 4వ తేదీ నుంచి మండలంలో వైఎస్‌ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బెస్తపల్లె క్రాస్ వద్ద ఉన్న మామిడికాయల మండీలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆసరా సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశానికి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని దేవనాథరెడ్డి కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో వెలసిన శ్రీ పట్టాభి రాముల వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 3 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కరణం ప్రకాష్‌రావ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం ఆలయంలో రక్షా బంధనం, అంకురార్పణ, శేష వాహనం, మంగళవారం ధ్వజారోహణం, మోహినీ ఉత్సవం, సూర్య ప్రభ వాహనం, సింహ వాహనం, బుధవారం స్వామివారి కళ్యాణోత్సవం, గురువారం బ్రహ్మ రథోత్సవం, శుక్రవారం వసంతోత్సవం, పార్వేటోత్సవం, శయనోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఉన్నత లక్ష్యంతో ఉజ్వల భవిష్యత్తు

కురబలకోట: విద్యార్థులు సమున్నత లక్ష్యంతో చదువుల్లో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అంగళ్లలోని విశ్వం విద్యా సంస్థల చైర్మన్ ప్రభాకర్ రెడ్డి కోరారు. శనివారం రాత్రి కళాశాలలో 16వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఉజ్వల భవిష్యత్తుకు దారులు తెరచుకుంటాయన్నారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయానికి ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించేందుకు ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఇరుగులమ్మ మాతకు పూజలు

సిద్దవటం : ఇరుగులమ్మ మాతకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించినట్టు ఆలయ పూజారి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వచ్చిన భక్తులకు మండలంలోని ఆకురోపల్లె గ్రామానికి చెందిన గాలి పెద్ద పాలకొండయ్య దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారని తెలిపారు.

నల్ల గంగమ్మ ఆలయంలో విశేష పూజలు

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మల్లూరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధు మిత్రులతో కలిసి విందును ఆరగించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : నందలూరు ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్(నందలూరు బస్టాండు)లో రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సూర్యనారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఎమ్మెల్యే మేడా ఆధ్వర్యంలో చేయనున్నట్లు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. దళితుల పట్ల మేడా కుటుంబానికి ప్రత్యేక అభిమానం, గౌరవం ఉందన్నారు. దళితులకు అన్ని విధాలుగా అండగా ఉండేందుకు ఎల్లప్పుడూ ఎమ్మెల్యే సోదరులు ముందంజలో ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డుసెక్రటరీ సయ్యద్‌అమీర్, దళితనాయకులు తుమ్మాది శివ, నరసింహులు, బీసీ నేత హిమగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసాయి సేవాశ్రమం వ్యవస్థాపక దినోత్సవం

అమ్ముల సాంబశివరావుచే స్థాపించబడిన శ్రీ సాయి సేవాశ్రమం 29వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా గొల్లపల్లె రోడ్డులోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సాయికోటి యజ్ఞం వద్ద శ్రీ షిరిడి సాయి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ముందు కాగడా హారతితో పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజల్లో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సూర్యనారాయణ, జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ అమీర్, మండల కో-ఆప్షన్‌సభ్యుడు కలీం, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టరు పల్లెమాధవి, బీసీ నాయకులు హిమగిరియాదవ్, నరసింహులు, విజయుడు, ఆలయ నిర్వాహకులు గాడి సుబ్బరాయుడు, గొల్ల సుబ్బరాయుడు, తుమ్మల శ్రీధర్‌గౌడ్, మాచుపల్లె సుబ్బరాయుడు, పాలెం సాంబశివయ్యగౌడ్, వెంకటరమణ, హనుమంతు ప్రసాద్, మణి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు.

ఇమామ్, మౌజన్లకు సరుకుల పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఇమామ్‌లు, మౌజన్లకు లజనతుల్ ఉలేమాకమిటీ ప్రతినిధులు ఆదివారం నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. నగరంలోని కాగితాలపెంట కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో సంస్థ వ్యవస్థాపకులు, కార్యదర్శి మౌలాన మహమ్మద్ అలీ రషాది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మౌలాన ఇందాదుల్లా నిజామి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో దాతృత్వం కచ్చితంగా చాటుకోవాలన్నారు. ఆరేళ్లుగా లజనతుల్ ఉలేమా కమిటీ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ఇమామ్‌లు, మౌజన్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎంఎం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ మహబూబ్ పీర్, జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ తాహీర్, స్థానిక ప్రముఖులు సుబాన్‌బాష, మౌలాన బాసిర్ అంబాయి మాట్లాడారు. మౌలాన అబ్దుల్ రెహ్మాన్, ముఫ్తీ మసీవుల్లా, ప్రభుత్వ ఖ్వాజీ సిరాజుద్దీన్ బుఖారి, సంఘ సేవకులు అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం చూడ ఎంత భాగ్యము..



నృత్యం చేస్తున్న చిన్నారులు



ఊంజల్ సేవలో సేదతీరుతున్న ఉత్సవమూర్తులు

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శ్రీ రామచంద్రమూర్తి ఆదివారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో, రాత్రి సింహ వాహనంపై సీతాపతి ఊరేగారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో స్వామి వారి వాహన సేవలను చూసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల నృత్యాలు, వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కోలాటాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను రంజింపజేస్తున్నాయి. – ఒంటిమిట్ట



కోలాటమాడుతున్న మహిళలు



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆలస్యమైతే పరీక్షా కేంద్రంలోకి అనుమతి నిరాకరణ
- మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



రాయచోటి: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంవీ కృష్ణారెడ్డి, అధికారులు

సిద్దవటం : మండలంలోని 10వ తరగతి పరీక్షలు సోమవారం నుంచి జరుగుతున్నాయని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు సంబంధించి ఏ, బి, రెండు సెంటర్లను కేటాయించామన్నారు. మొత్తం 338 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని వీరిలో ఏ సెంటర్‌లో 170 మంది విద్యార్థులు, బి సెంటర్‌లో 168 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పెనగలూరులో..

పెనగలూరు : నేటి నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పెనగలురు జిల్లా పరిషత్ హైస్కూల్ చీఫ్ జయలక్ష్మమ్మ తెలిపారు. ఈ పాఠశాలలో 148 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ఆమె తెలియజేశారు. అలాగే ఎన్ఆర్ పురం, పెనగలూరు, మోడల్ స్కూల్, ఓబిలి హీరా స్కూల్, కస్తూర్బా గాంధీ స్కూల్ విద్యార్థులు ఇక్కడ పరీక్ష రాయనున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో పదోతరగతి పరీక్షలు 508 మంది విద్యార్థులు మూడు సెంటర్లలో రాయనున్నారు. పెనగలూరు జిల్లాపరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్, చక్రంపేట హైస్కూల్‌లలో పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎస్ఐ హేమాద్రిలు తెలిపారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : నేడు (సోమవారం) నుంచి నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల విద్యాధికారిణి పద్మజ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశించిన సమయానికి కచ్చితంగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఆలస్యమైతే అనుమతించరన్నారు. తప్పకుండా హాల్ టికెట్లు తెచ్చుకోవాలని సూచించారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ముక్కవారిపల్లి బాలుర గురుకుల పాఠశాల ఏ- సెంటర్‌లో 200 మంది విద్యార్థులు బీ- సెంటర్‌లో 180 మంది విద్యార్థులు, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 280 మంది.. మొత్తం 660 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

రాయచోటి : పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి వీలుగా పరీక్షా కేంద్రాలలో ఉన్న వసతులను పది పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ఎంవీ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఆదివారం రాయచోటి పట్టణ పరిధిలోని పరీక్షా కేంద్రాలను ఉప విద్యాశాఖ అధికారిణి వరలక్ష్మీతో కలిసి ఆయన పరిశీలించారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నేలపైన పరీక్షలు ఎట్టి పరిస్థితులలో నిర్వహించరాదన్నారు. విద్యార్థులు పరీక్ష రాయడానికి బెంచీలు, తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు తప్పనిసరిగా పరీక్షా కేంద్రంలో ఉండాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా ఉండటానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పరీక్షా కేంద్రాలలో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ భేరిని విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : ఈ నెల 8న మదనపల్లెలో నిర్వహించనున్న రాజ్యాంగ రక్షణభేరి మహాసభను విజయవంతం చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాజ్యాంగ రక్షణ భేరి ప్రచార రథం పీలేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తమ కళావాహిని కళాబృందంచే భారత రాజ్యాంగంపై జరుగుతున్న కుట్రలపై ఆట, మాట, పాట రూపంలో ప్రజలకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముల్లంగి కృష్ణయ్య, ఎర్రబెల్లి మల్లిఖార్జున, మహేష్, మల్లేష్, బాబు, గిరి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు బోనాలు

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె పంచాయతీ గుర్రెడ్డిగారిపల్లె గ్రామ సమీపంలో బోయకొండ గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం గుర్రెడ్డిగారిపల్లె నుంచి పలువురు భక్తులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్లారు. పొంగుబ్యాలు పొంగించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

ఘనంగా ఏటిగంగమ్మ తిరునాల

తంబళ్లపల్లె: మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ ముత్రవారిపల్లె బస్టాప్‌వద్ద వెలసిన ఏటిగంగమ్మ తిరునాలను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. పూజారి మదన్‌మోహన్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టండి



వెలిగల్లు ఇన్‌టేక్ వెల్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

రాయచోటి అర్బన్ : వేసవిని దృష్ట్యా నీటి సరఫరా విభాగం అధికారులు పట్టణానికి తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని పెట్టాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన రాయచోటి మున్సిపాలిటీకి తాగునీటిని అందించే వెలిగల్లు వాటర్ స్కీమ్ ఇంటెక్ వెల్, ఎగువగొట్టివీడు మంచినీటి శుద్ధి కేంద్రాలలను ఆయన పరిశీలించారు. ఇంటెక్ వెల్‌లో ఎన్ని మోటార్లు ఉన్నాయి ? అన్ని సక్రమంగా పనిచేస్తున్నాయా ? అంటూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిత్యం పట్టణానికి ఎంతనీరు అవసరం ? స్కీమ్ నుంచి ఎంతమేర నీరు రాయచోటికి వెళుతోందంటూ అడగడంతో పాటు అక్కడి రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం గొట్టివీడు వద్ద ఉన్న నీటిశుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. నీటిశుద్ధిలో క్లోరిన్, ఆలమ్‌లను సరైన మోతాదులో వినియోగించాలంటూ అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జున, వాటర్ స్కీం సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఐజీ లే ఔట్‌లో పనుల పరిశీలన

మున్సిపల్ పరిధిలోని జగనన్న స్మార్ట్ సిటీ ఎంఐజీ లే ఔట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పరిశీలించారు. మున్సిపల్ అధికారులతో కలసి ఆయన లే ఔట్‌లో కలియతిరిగారు. ఇప్పటికే పూర్తయిన యూజీడీ, రోడ్డు నిర్మాణం, కాలువల నిర్మాణం పనులను పరిశీలించారు. శరవేగంగా సాగుతున్న సెంట్రల్ మీడియన్ ఈఎల్ఎస్ఆర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే వంద శాతం ప్లాట్లు అమ్ముడుబోయిన ఏకైక ఎంఐజీ లే ఔట్‌గా రాయచోటికి గుర్తింపు లభించిందన్నారు. ప్రజల నుండి వస్తున్న ఆదరణను చూసి మరో 20 ఎకరాలలో లే ఔట్‌ను తయారుచేసే పనులలో అధికారులు నిమగ్నమై ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అనుడ) వైస్ చైర్మన్ వై.ఓ.నందన్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జునతోపాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 52ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న బంజారా సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 52ను వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బి. అమ్రూనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనుకోవడాన్ని తప్పుబట్టారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం ప్రత్యేక వ్యవహారాలు, జీవన విధానాలు, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా కొన్ని తెగలను గుర్తించి ఎస్టీ జాబితాలో చేర్చారన్నారు. ఈ అంశాలను పరిగణలోనికి తీసుకోని రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం అన్యాయమన్నారు. ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వాస్తవాలను పక్కనబెట్టిందని ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో ఉన్న ప్రజాప్రతినిధులు వీరికి వంతన పాడుతూ ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 12వ తేదీ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సేవా సంఘం అధ్యక్షుడు అమృతనాయక్, ప్రధాన కార్యదర్శి బిల్లు నాయక్, ఆర్గనైజేషన్ సెక్రటరీ రవీంద్రా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు

మదనపల్లె : పట్టణంలోని బలిజకులస్థుల చిరకాల కోరిక శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ స్థాపనకు సంబంధించి ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఆదివారం బలిజసేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో మల్లికార్జున సర్కిల్‌లో క్రేన్ సహాయంతో శ్రీ కృష్ణదేవరాయల విగ్రహాన్ని దిమ్మెపై ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ బలిజసేవాసమితి అధ్యక్షులు బీపీఎల్.విజయకుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలవతి మాట్లాడుతూ 30 ఏళ్లుగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటుచేసేందుకు బలిజ కులస్తులు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వచ్చామన్నారు. ఎట్టకేలకు ప్రస్తుతం సంకల్పం కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందన్నారు. విగ్రహ ఏర్పాటుకు బలిజసేవాసమితి ఆధ్వర్యంలో టీటీడీ బోర్డ్ మెంబర్ పోకలఅశోక్‌కుమార్‌ను కలిసి తమ కోరికను ఆయనకు తెలిపితే స్పందించిన ఆయన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో ఎంపీ మిథున్‌రెడ్డి విగ్రహాన్ని తన సొంత నిధులతో ఏర్పాటుచేస్తానని చెప్పడమే కాకుండా అనువైన స్థలాన్ని ఎంపిక చేయాల్సిందిగా తమకే అవకాశం కల్పించారన్నారు. మల్లికార్జున సర్కిల్‌లో ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే నవాజ్‌బాషాను కోరితే ఆయన తక్షణమే పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయించారన్నారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటులో ఎంపీ, ఎమ్మెల్యే కృషి, సహకారం మరువలేనిదని తెలిపారు.